నాటిక:

# సులోచన

(సులోచన కూతురుని ఉయ్యాలలో ఊపుతూ జోల పాట పాడుతూ ఉంటుంది. కొడుకు పులస్త్యుడు ప్రక్కనే కళ్లు మూసి కొని పడుకొని ఉంటాడు.)

సు జో జో జో. (పాటపాడుతూ ఉంది)

పాప అమ్మా, నాన్న వచ్చారా.

సు ఇంకా పడుకోనేలేదేమే. ఇంత సేపటినుంచి నిద్రపుచ్చుతోంటే. వస్తారమ్మ పడుకో. జో జో.

పా ఇంకా ఎప్పుడొస్తారేమిటి నాన్న నిన్నా ఇల్లాగే అన్నావు మొన్నా ఇల్లాగే అన్నావు. ఇంకా రాలేదు మరి ఎప్పుడొస్తారూ ఊ. ఊ. (అని గారాబంగా రాగాలు తీస్తుంది)

పులస్త్యుడు: అమ్మా! నేను ఏడవను కాదమ్మా?

సులో నువ్వూ నిద్రపోలేదురా? పడుకో! నాన్నా. పడుకోండి త్వరగా.

పుల కాదే అమ్మా! మొన్న నాన్న నన్ను యుద్ధంలోకి తీసుకెళ్తానన్నారు నేను కవచం కత్తి అన్నీ కట్టుకొన్నాను ఇంతవరకూ రానే లేదు మరి నేను ఏడ్చానా చెల్లాయిలాగా? చెల్లాయి వట్టి పిరికి. ఊరికే ఏడుస్తుంది.

పాప పాపం నువ్వు ఏడవలేదు కాబోలు! కాదే అమ్మా! నిన్న కోటగుమ్మం దాటి యుద్ధంలోకి వెళ్తానని వెళ్తూంటే తాతయ్యగారు, చూసి వెనక్కి పొమ్మన్నారు. గుడ్లనీళ్ళు కుక్కుకుంటూ వచ్చాడు

పుల నేనేం గుడ్లనీళ్ళు కుక్కుకోలేదు ఇప్పుడు కాదన్నారుగా! నే నాన్నతో కలసి యుద్ధాని కెళ్లనూ? తాతయ్యగారు కూడా అప్పుడు ఏమీ అనరు.

సులో పెద్దుగానిలే నాన్నా, పడుకో పొద్దుపోయింది. నాన్న వచ్చేటప్పటికి ఇంకా లేచిఉంటే కోప్పడతారు. పడుకోండమ్మా.

పుల అమ్మా నాన్న ఈ పాటికి రామ లక్ష్మణులను ఇద్దరినీ చంపేసి ఉంటారు కాదూ. నేను వాళ్లను చూడాలనుకొన్నాను ఎల్లాగమ్మా మరి?

సులో: ముద్దువుగానిలే నాయనా! పడుకో.

(జో జో అని పాడుతూవుంది. పిల్లలు నెమ్మదిగా నిద్రకు కునికి గుఱ్ఱు పట్టుతారు. అత్తయి ప్రవేశం)

అత్తయి ఏం అక్కా! పిల్లలు పడుకున్నారా?

సులో రా, అత్తయీ! ఇప్పుడే పడుకొన్నారు కూర్చో.

అత్తయి ఏం కూర్చోను. నా కేమీ తోచటం లేదు మీవారు మేఘనాథులు ఇవాళిటికి ఇంకా ఇంటికి రాలేదా?

సులో రాలేదు ఈ యుద్ధం ఏమిటో నాకు తోచటం లేదు. దేవేంద్రుడిని జయించి లాక్కువచ్చినప్పుడైనా వీరి కిన్నాళ్లు పట్టలేదు. అదీకాకుండా లోకవిజేతలైన మామగారిమీదికి ఈ రాజుకొడుకు లిద్దరూ ఇంత సాహసంగా ఎల్లా వచ్చారో.

అత్తయి పిల్లకాకి కేం తెలుసు ఉండేలు దెబ్బ అన్నట్టు, అష్టదిక్పాలురని వాకిళ్లో పడిగాపులు కాయిస్తూ ముల్లోకాల నేలుతున్న మీ మామగారిమీదికి వానరాలనీ, భల్లూకాలనీ చేరదీసుకొని దండెత్తివచ్చారంటే, వల్లమారిన పొగరుగాక మరేవిటె చెప్పు?

సులో ఏమైనా మామగారంతటి వారితో మనుషు లెవళ్లూ చెయ్యనంత ఘోరంగా ఇంత యుద్ధం సాగించగలుగుతున్నారంటే, వాళ్లల్లోనూ ఏదో మహత్యం ఉండి తీరాలి! వీళ్ల కన్నేళ్లుంటాయి ఏవిటి?

అత్తయి ఎన్నెన్ని ఉంటాయి! పట్టుమని పాతికేళ్లయినా ఉన్నట్టు లేదట.

సులో అయితే ఆ సీత అంతకన్నా కూడా చిన్నదన్నమాట. మనుమల నెత్తిన ఈ ముదిమిలో మామగారు.

అత్తయి మామగారు ఇంత బతుకూ బతికి చివరికి ఈ నరస్త్రీని ఇంతకన్న అందకత్తె దొరదని కామించే తెచ్చారనుకున్నావేమిటి?

సులో అబ్బే. అది కాదు ఛా ఛా. పితృతుల్యులగు వారిని నేనలా అంటానా. కాదు. అసలు ఈ కాలంలో వీరిల్లా ఎందుకు తలపెట్టారో? ఇదంతా ఎందుకొస్తోందో?

అత్తయి ఎందుకు తలపెట్టారా? వీళ్ల పొగరణచడానికే తలపెట్టారు. ఎంతపొగరు కాకపోతే, మనజనపదాలలోకి వచ్చి, ఆ ఋషులఅండ చూసుకొని, మనవాళ్లనందరినీ హతమారుస్తూ తిరుగుతారు? అదీ కాకుండా, సాక్షాత్తూ త్రిలోకనాయకులైన రావణుల సహోదరిని అపహాస్యాల పాలుచేసి, 'చెప్పుకో పో' అన్నట్టు నిర్భీతిగా వెక్కిరించి పంపిస్తారా? పైగా నీ ప్రతాపమెంతా అని ఆయన్ని ఉడికించినట్లు ఒంటరిగా పసిఆడదాన్ని వెంటపెట్టుకొని, మన ఏలుబడిలో ఉన్న రాజ్యంలో నిర్భయంగా సంచరిస్తారా? ఇంతకన్న తిరస్కారముంటుందా? ఆ పొగరణచటానికే కాదా రావణులు నరాంగనను తీసుకొచ్చింది— అందానికోసం ఆవిడనే తేవాలా? చివరికి మనఆడవాళ్లల్లో ధాన్యమాలి కాలిగోరుకైనా పోలికకు వస్తుందా ఈఅమ్మాయి? కామంతో

తెచ్చినవారైతే ఏడాదిపాటు అల్లా అశోక వనంలో దిక్కు మొక్కు లేకుండా పడేసి ఉంచటం ఎందుకు. కానీ, కానీ! పిల్లకి శాస్తి చెయ్యకపోరు!

పుల (నిద్రలో కలవరిస్తూ) నాన్నా నేను వస్తున్నా! ఇదిగో నిన్నంతా కూర్చుని క్షాత్రబాణాలు తయారుచేశా! నేను నీలాగే ఎగిరి రానా.

అత్తయి పులస్త్యా! పులస్త్యా!

సులో: ఏవో నిద్రలో కలవరిస్తున్నాడు. మూడురోజులనించి అస్తమానూ "రామలక్ష్మణులను చూసి యుద్ధం చేస్తాను. నాన్నతో వెళ్తాను" అని

పుల (నిద్రలో) ఆఁ. ఆఁ నాన్నా. నాన్నా అమ్మో. నాన్న (అంటూ గట్టిగా ఏడుస్తూ లేస్తాడు)

సులో (పిల్లడికి దిష్టి తీస్తున్నట్లుగా) థూ! థూ! లంకిణీ దేవరక్ష! థూథూ! బాబూ లేదులే! లేదులే పడుకో కల వచ్చిందా నాయనా.

పుల (ఏడుస్తూ) అమ్మా నాన్న మడి గట్టుకొని జపం చేస్తుంటే ఆ విభీషణుడు తాతయ్య కోతులూవచ్చి అల్లరి చేసి నాన్నను లేవగొట్టి తరుముతూ తీసుకెళ్లారు. నాన్న వాళ్లను తరుముతుంటే ఆయ నెవరో బాణము వేసి నాన్నను చంపేశాడు అమ్మా నాన్న ఏడీ?

అత్తయి ఛీ. ఛీ వెధవ పీడకల. లేదు బాబూ లేదు పడుకో నాన్న యిప్పుడే వస్తారు.

సులో పిచ్చిబాబు మీ నాన్నకేం భయంలేదమ్మా నాన్నను ఎవరూ చంపలేరు. నా దగ్గిరమణి ఇచ్చారుగా నాన్నకు.

పుల లేదే అమ్మా. ఆ మణి కట్టుకోకుండానే నాన్న అడావుడిగా వెళ్ళిపోయారు. ఇదిగో మణి నా మెడలో కట్టుకొన్నాన

సులో (అదిరిపాటుగా) ఆఁ. ఆఁ. కట్టుకెళ్ళలేదా! (మణి తీసుకొని) అయినా ఫరవాలేదు బాబు నాన్నను ఎవరూ ఏం చెయ్యలేరు మీ తాతయ్య ఆదిశేషులు తప్ప నాన్నను జయించగలవారు లేరు. ఇప్పుడే సుఖంగా వస్తారు పడుకో.

పుల ఆయ నెవరో బాణం వదుల్తుంటే అచ్చు తాతమాదిరిగానే కనబడ్డారమ్మా.

సులో: (బుజ్జగిస్తూ పిల్లడికి నమ్మకం చెప్తూ) తాత నాన్నతో గంగచేసాం బాబూ నువ్వు చెప్పు?

పులస్త్యుడు చెయ్యరు.

సులో చూశావా మరి, పట్టి పీడకలలు పడుస్తావా! మరి ఇల్లా పడితే యుద్ధానికేం వెళ్తావు?

పుల పడవనమ్మా, నేనూ యుద్ధానికెళ్ళి నాన్నమీద బాణం వేసినవాళ్ళను కత్తితో నరికేస్తా.

సులో అల్లాగేలే పడుకో బాబూ, ఇప్పుడే పడుకొంటే - ప్రొద్దున్నే నాన్నగారితో బయలుదేరి వెళ్ళొచ్చు. మరి పడుకో. జోల పాడనా, జో జో, (అని పాడుతుంది. పిల్లడు నిద్రపోతాడు (అనుర్ధాగా) అత్తయా యుద్ధసమాచారాలు నీకు నిజంగా ఏమీ తెలియవా?

అత్తయి రావణులు స్త్రీల అంతఃపురం వద్ద యుద్ధవార్తలు తెలిపినవారిని నరికేస్తానని ఆజ్ఞ ఇచ్చారు. అశోకవనంలో మాత్రం ఎల్లాగో కొన్ని కబుర్లు తెలుస్తున్నాయి, కాని అవి నిజాలు ఔనో కాదో తెలియదు

సులో మావారి యుద్ధవిశేషాలు ఏమైనా తెలిసాయా?

అత్తయి నేను పూర్తిగా వినలేదు. త్రిజట ఏదో చెప్తూంది మేఘనాథులు తన రథంలో సీతను లాక్కుపోయి రామలక్ష్మణుల సైన్యాల ముందు రథం నిలిపి సీతను తల తెగవేశారట

సులో ఆఁ, ఆఁ, అంతపని వారు చేయరే, సీతాదేవిని వారు కన్నెత్తి అయినా చూడలేదే! అల్లాంటిది స్పృశించి అంతటి భీకరానికి ఒడిగడ్తారా? అత్తయా, అబద్ధం అయివుంటుంది

అత్తయి ఏమో! ఆ సైన్యం అంతా హాహాకారాలతో ఏడుస్తూ చెదిరిపోయారట రామలక్ష్మణులు మూర్ఛపోయారు. ఇంతలో మేఘనాథులు యజ్ఞవాటికకు వచ్చి నికుంభిలాయజ్ఞం ప్రారంభించారట.

సులో అబ్బాయి కలలో అల్లాగే అన్నాడే మడి గట్టుకొని కూర్చున్నారని మానికుంభిలా యజ్ఞమే! ఆ యజ్ఞానికి భంగం కలిగితే చాలా ప్రమాదకరమే! అంత తీవ్ర వృత్తికి నాథులు ఎందుకు దిగినారో! అత్తయా! యజ్ఞభంగం కాలేదుగదా నిజం చెప్పు నాకు చాలా ఆత్రంగా ఉంది

అత్తయి కేవలం భంగం అనేందుకు వీల్లేదు యజ్ఞం అవుతూండగానే హనుమదాదివానరులు విభీషణుడూ వచ్చి, కవ్వించి ఆయన్ని యుద్ధానికి తరిమారట. ఆ దాటున మేఘనాథులు శత్రుశిబిరందాకా మారిమసగినట్లు శత్రువులను వేటాడుతూ జొచ్చుకుపోయారట, ఆ తర్వాత కబుర్లింకా ఏమీ తెలియలేదు. ఏమమ్మా ఇంత ధీరోదాత్తవు! ఇంత కేనా, కంటనీరు!

సులో (తేరుకుని నవ్వి విషాదంగా గాద్గదికంతో శే) లేదు. అత్తయా, మహావీరుల విషయంలో కన్నీరెందుకు!

అత్తయి కాదమ్మా ఏమీ కాలేదు. మేఘనాథులు సుఖంగా తిరిగిరాగలరు.

సులో రారు అత్తయా రారు. అయినా ఫరవాలేదు నేనే వారివద్దకు వెళ్తున్నా అత్తయా, అత్తగారు మండోదరి కూడా రేపో మాపో మళ్లీ మమ్మల్ని కలుసుకొనే వారే కదా. నీ అదృష్టాన నీవు ఇక్కడే ఉంటే ఈ బిడ్డ లిద్దరినీ జాగ్రత్తగా కాపాడు.

అత్తయి. ఏమిటమ్మా ఈ అప్పగింతలు. ఎక్కడికి వెళ్తావు?

సులో అత్తయా నీకు తెలియదు. నాకు తెలుసును బిడ్డకు పులస్త్యుడికి కలలో తెలిసింది స్వర్గనాథులను గెలిచిన మేఘనాథులకు కూడా, దక్షిణదిగ్నాథుని దేశద్వారం నుంచి తప్ప స్వర్గానికి వెళ్లటం పడలేదు. నేనూ నా నాథుని అనుసరిస్తా

(మండోదరి ప్రవేశం)

అదుగో అత్తగారు. అత్తా నమస్కారం మీ కోడలికి సహగమనానికి అనుజ్ఞ యివ్వండి.

మండో (అశ్రుకంఠంతో) అమ్మా. నీకు తెలిసిందా ఈకబురు! నాకడుపునా, నీ గుండెల్లోనూ నాకొడుకు ఆరని చిచ్చు పెట్టి, ఏగిన కబురు! ఇంద్రజిత్తూ! ఇంద్రజిత్తూ! (ఏడుస్తుంది)

సులో ఆహా అనుమానం నిజమే నన్న మాట.

అత్తయి అమ్మా త్రైలోక్యమహారాజ్ఞీమణులు మీరుకూడా పామరులలాగా దుఃఖిస్తారా?

మండో సులోచనా! నీకు కబురే తెలియలేదా? అల్లా బయలుదేరుతున్నా వెక్కడికి తల్లీ! నా సందేహం రానీ.

సులో (దుఃఖంలో ఆశక్తిత అనుమానంతో) అత్తా! మీ అబ్బాయికి సామాన్యుల చేతిలో మృతిలేదు—మీకు ఈ వార్త తెలిసిన వివరం చెబుతారా?

మండో. అమ్మా—— ఏమని చెప్పను

అబ్బాయియజ్ఞం భంగంచేసి, మరిదిగారూ అంగదాదులూ, ఉడుకుమాటలతో కవ్వించారు

సులో సీత తల నరికారని వాళ్లిరితా నిస్పృహులై కూలిపోయారట కాదా.

మండో ఛీ. సీతకాదు. మాయాసీత

సులో మాయే కదా. పోనీ ధన్యురాలను. నాథునికి ఆ పాపం చుట్టుకోలేదు.

మండో ఇంద్రజిత్తు పాపవర్తి ఎల్లా అవుతాడమ్మా? యుద్ధంలో శత్రువుని నిర్వీర్యుని చెయ్యడానికి ఆ మాయ చేశాడు. మరిదిగారి కా కిటుకు తెలుసు. ఇది నికుంభిలాయజ్ఞం. నిర్విఘ్నంగా సాగటానికి చేసిన పన్నగడ అని తెలిసి, దానికి భంగం కల్గించారు. అంతతో యుద్ధంచేస్తూ వాళ్ళ శిబిరందాకా లక్ష్మణాదులను తరుముకొని వెళ్లాడు. లక్ష్మణుడు వెనుదిరిగి మహాస్త్రం సంధించి, నా కుమారుణ్ణి పడవేశాడు. ఇంద్రజిత్తూ! (సన్నగా విలపిస్తుంది.)

సులో హా (మూర్ఛపోతుంది.)

అక్షయి అమ్మా! అమ్మా! సులోచన మూర్ఛపోయింది. సులోచనా! సులోచనా!

మండో సులోచనా! (మొగాన్న నీళ్లు చల్లుతారు)

సులో (తేరుకొని దిగ్గున నిలిచి) అత్తా. నా నాథుని శరీరం ఇక ఇచ్చటికి తెప్పించండి.

మండో అమ్మాయీ! శత్రుశిబిరంలో పహారాలో ఉంచారట కొడుకు దేహాన్ని. ప్రాణం పోయిందని నమ్మకం శత్రువులకే చిక్కటంలేదు. మీ మామగారు రేపు రవి అస్తమించేలోపుగా శత్రువులను పూర్తిగా నిర్మూలం చేసి, కొడుకుని బ్రతికించి తెస్తానన్నారు.

సులో వద్దమ్మా రేపటిదాకా ఆగను. అయినా మామగారికి శత్రుదమనం ముఖ్యం. వారికి దారేషణలు పుత్రేషణలు లేవు వారిని మళ్లీ ఈ కశ్మలంలో దింపను నాకు నా నాథుని చూడటమే ముందు ముఖ్యం. వారు ప్రాణంతో ఉంటే నేనే తెచ్చుకుంటాను. లేకుంటే అక్కడే చితి అంటించుకొని సహగమనం చేస్తాను. సెలవీయండి.

మండో అసు [illegible] వెళ్ళకు ఆగు. పౌలస్త్యులు దీనిని ఇంతలో [illegible]నియ్యరు.

సులో అత్తా. జగద్రావణులైన రావణుల దృష్టి వేరు. మన దృష్టి వేరు. కుమారుని తెచ్చుకోటం వారికి ప్రతాపచిహ్నం. ఆ విషయాన్ని మనం రెచ్చగొట్టి వారిని బాధించవలసినవాళ్లం గాము. నా స్వవిషయం నాకు వదిలేయండి. సెలవీయండి

మండో అమ్మాయీ నువ్విలా శత్రుశిబిరానికి వెళ్తే పౌలస్త్యులకు గౌరవభంగం కాదా?

సులో అత్తా పతిప్రాణభిక్షుగాని, మరే భిక్షుగాని కోరినదాన్నై వెళ్తే, వారి కవమానమే! కాని నే నల్లా వెళ్లటంలేదే. అయినా నే నిల్లా వెళ్లినట్లు వారి కెవరూ తెలియనీకండి. ఇదే నామీద ఆన. మీపాద పద్మాల కిదే నమస్కారం, సెలవు.

మండో ఆగు అమ్మా పోనీ, అక్షయీ నువ్వైనా అమ్మాయికి తోడు వెళ్లు ఈ అర్ధరాత్రివేళ ఒంటరిగా అంతఃపురాంగన యుద్ధభూమికి పయనమా? హా హా! హతవిధీ!

సులో వద్దు అత్తా ఎవరూ వద్దు. నాకు ఏ స్వల్పఅసౌఖ్యాలూ, కష్టాలూ, లేవు. నన్ను ఏకాకినిగానే వెళ్ళనీయండి. నా కదే సుఖం. (నిష్క్రమిస్తుంది)

మండో సులోచనా! మహాసతీ!

### ౨-వ రంగము

(రాముని సైన్యాల శిబిరాల శ్రేణీముఖంలో వానరులు దూరాన పహరా ఇస్తూంటారు. అంగదుడు సుషేణుడు కూర్చుని ఉంటారు.)

అంగదుడు. అబ్బా! ఇంకా ఆ దేహాన్ని చూస్తే భయమే వేస్తూంది ఎంత యుద్ధం చేశాడు! ఎంత భీభత్సం జరిగిపోయింది, సుషేణా! ఇంకా ప్రాణాలున్నా యంటావా?

నీలు ఉండవచ్చును. ఈ రాక్షసనాథులకు ప్రాణాలు అస్తులకన్న అంతర్గతంగా ఉంటాయి. అదీ కాకుండా మృత్యువును స్వాధీనంచేసుకున్న వారు, ఈ తండ్రికొడుకులు. వాళ్లమేధస్సులో ఏ చిన్న సిరలో కదలిక ఉన్నా వాళ్ల ప్రాణం నిలబెట్టుకోగలరు.

అంగదుడు కాని లక్ష్మణుల అస్త్రానికి ఎదురు తిరిగి ప్రాణాలుఅంటూ ఉంటాయా? అబ్బ, ఎంత శబ్దంతో చేదించింది ఆ అస్త్రం, ఆ రాక్షసుని గుండెలను! వేయి పిడుగులు పడిన చప్పుడైంది. ఆ విద్యుద్ఘర్షణకు నా కళ్లు మిరుమిట్లుకొలిపాయి. కొండలాగ కూలిపోయాడు ఇంకా ప్రాణం ఎక్కడ ఉంటుంది? అబ్బా పడిపోయి మృతిపొందినా ఎంత భయంకరుడుగా ఉన్నాడో!

సుషే: విభీషణులు ఈ కళేబరాన్ని శత్రువులకు చిక్కకుండా నాలుగు రోజులవరకు కాపలా కాయమన్నారు

అంగ ఆయనకు పట్టి భయం. అంతకన్న వేరేమీ లేదు. (దూరాన కలవరం — 'అమ్మా మీ రెవ్వరో ఇటు వెళ్ళడానికి వీల్లేదు.'—అంటూ సైనికులు—'నాయనా నేనేం అపకారం చెయ్యను. రామలక్ష్మణుల దగ్గిరకు వెళ్ల నియ్యండి' అని సులోచన కంఠం)

సుషే ఎవరు, ఎవరో ఒక స్త్రీమూర్తి కాపలావాళ్లను తొలగించుకొని వచ్చేస్తూంది.

అంగదుడు అదేమిటి, ఆమెను చూసి నిశ్చేష్టులై అల్లా నిలచిపోతున్నారు. అరగె వచ్చేస్తోంది. మళ్లీ ఇదేం కామినీమాయయో. (గట్టిగా) రానీయకండి. ఆ స్త్రీని రానీయకండి. (అని అరుస్తాడు.)

(కాపరి పరుగెత్తుకొనివచ్చి) అయ్యా ఆమె ఎవరో మాకు తెలియటం లేదు రామలక్ష్మణుల వద్దకు పోనీమని మావంక ఒకసారి ఆ కన్నులు విప్పి చూసేటప్పటికి, మేము కాదనలేక నిశ్చేష్టుల మయిపోతున్నాం ఆమె కన్నెత్తి చూస్తే మీరూ అంతే నేమో మేమేం చేయలేము. మీరే కాచుకోండి

(సులోచన ప్రవేశం)

అంగదుడు (అడ్డు నిల్చుని) ఎవరమ్మా మీరు, ఈ నిశిరాత్రివేళ శత్రుశిబిరంలోకి ఇల్లా వస్తున్నారు? రాకూడదు వెళ్లండి

సులో నాయనా నన్ను అడ్డకండి లోపలికి వెళ్లనీయండి నేను ఎవరికీ ఏమీ అపకారం చెయ్యను

కాపరి వెళ్లనీయకండి ఈమె ఎవరో కామినీభూతం అసలు కళ్లుమూసుకుని ముందు వెళ్లగొట్టండి. ఆమె కళ్లవంకచూస్తే నీరుకారిపోతారు.

సులో నాయనా!

కాపరి అమ్మా నాకు తెలియదు నేను వెళ్లిపోతున్నాను మీరే వెళ్లి చూసుకోండి

సుషే అమ్మా! నీకేసి చూడలేను. నా కళ్లు మూసుకుంటున్నాను, వెళ్లిపో అమ్మా వెళ్లిపో మేము స్త్రీతో యుద్ధం చేయాల్సిన అవసరం కల్పించకు. ఇక్కడిక రాకూడదు. త్వరగా వెళ్లిపో.

అంగదుడు (శాంతంగా) మాయాసీత

(38-వ పేజీ చూడుడు)

# సులోచన

(7 పేజీ తరువాయి)

లాగు ఇదేదో రాక్షసమాయే అయివుంటుంది. అమ్మా నీ కళ్లల్లో ఏదో ఇంద్రజాల ముంది. మాయలో పడి పోతా మన్న భయంతో మే మేదో ఘోరం చేసేట్లున్నాము, వెళ్లిపో అమ్మా.

సులో: నాయనా ఇంత శాంతంగా నెమ్మదిగా చెప్పే తండ్రివి నువ్వు నా కెందుకు ఘోరం తలపెట్టావు? తలపెట్టవు. నాకేమీ వద్దు నన్ను శ్రీ రామలక్ష్మణుల వద్దకు తీసుకెళ్లండి.

సుషే: ఊహూ! వీల్లేదు

సులో: నాయనా ఇటు చూడు

సుషే: చూడకు అంగదా చూడకు నాలాగే కళ్లుమూసుకో.

సులో: నాయనలారా మీకు కృతజ్ఞురాలనై ఉంటాను. నా నాధునిదగ్గరకు వెళ్ళనియ్యండి. (ముందు అడుగువేస్తూ వెళ్లిపోతుంది)

అంగదుడు: నే కళ్లు తెరిచే లోపలే వెనక్కి వెళ్లిపో అమ్మయ్య అడుగులు వెనక్కి వేసినట్లుంది సుషేణా!

సుషే: ఏదీ అంగదా ఆమె ఏదీ. వెనక్కి వెళ్లినట్లు లేదే?

అంగదుడు: ఆఁ, ఆఁ, అదిగో ఇంద్రజిత్తు కళేబరాన్నుంచిన శిబిరంలోకే వెళ్తూంది. ఇది తప్పకుండా రాక్షసమాయే పద సుషేణా ముందు పద (గట్టిగా) ఓహో, హనుమంతా! విభీషణా! రాక్షసమాయ! జాగ్రత్త! జాగ్రత్త! పరిగెత్తు సుషేణా పరిగెత్తు ముందు ఆమెను ఆపాలి సామాన్యులెవరూ ఆమెను ఆపలేరు (శిబిరాలకేసి పరుగెత్తుతారు)

## 3-వ రంగము

రామలక్ష్మణులు—

రామ: లక్ష్మణా, జీవి దేహంవున్నంత వరకూ ఎంత బాధపడాలోయ్! ఆనాడు తటకప్రాణరిక్త మైనందుకన్నారా చూశాను ఈనాడీ ఇంద్రజిత్తుని మళ్లీ చూస్తున్నాను ఈప్రాణి ఈ దేహాన్ని ఇంత ఎందుకు ఆలయించాలో?

లక్ష్మ: అన్నా, ప్రాణనిర్గమనంలోనే ఉందా బాధంతా?

రామ: కాదయ్యా, కాదు దేహంలోనే ఉంది మనస్సులోనే ఉంది

లక్ష్మ: ఇంద్రజిత్తు దేహంవద్ద ఎవరు కాపలా ఉన్నారు

రామ: హనుమ ఉన్నాడనుకొంటాను. అయినా ఆ శరీరాన్ని రావణుడికి పంపించి వేద్దామా?

లక్ష్మ: విభీషణుడు వద్దన్నారు.

రామ: దేనికో

(నేపథ్యంలో అంగదునికేక) రామ లక్ష్మణదేవులారా జాగ్రత్త, ఆస్త్రీని చూడకండి

రామ: ఎవరు! ఆ స్త్రీ యెవరు!

లక్ష్మ: ఎవరు, మళ్లీ ఇంకో మాయాసీత కాదు కదా.

రామ: అబ్బా, ఆ ఘట్టం జ్ఞప్తికి తేవద్దు లక్ష్మణా! గుండె ఇంకా దడదడ లాడుతుంది.

లక్ష్మ: కాక రావణుడే ఇంద్రజిత్తు చావుతో బుద్ధి తెచ్చుకొని సీతామహాదేవిని పంపివేయలేదు కదా. అంతటి మహాతేజంతో మన సైన్యాన్నీ విభ్రమభయాలలో ముంచెత్తగల తేజోవంతురాలు ఆ దేవి కాక మరెవరుంటారు?

రామ: (నిట్టూర్చి) లక్ష్మణా, అడియాసలు పెట్టుకోకు రావణుని నీ వెరగవా, నేనెరగనా!

(సులోచన ప్రవేశించి)

సులో: శ్రీ రామచంద్ర, లక్ష్మణదేవులనుకొంటాను! తండ్రులారా నమస్కారములు.

రామ: (దిగ్గునలేచి) ఎవరమ్మా మీరు? ఈ సైన్యాన్ని, యుద్ధరంగాన్ని, చీల్చుకొని అర్ధరాత్రి మెరుపుతీగలాగా ఇల్లా వచ్చారు. మీ రెవరో నా కెవ్వరో మా తల్లిలా గున్నారు మేము నీ బిడ్డలం, తల్లీ నమస్కారం ఎవరమ్మా నువ్వు?

సులో: అయ్యా, లక్ష్మణదేవా లోకవ్యవహారంలో మీరు నాకంటే చిన్నలే కాని నాకు జనకసమానలని జనకులైన ఆదిశేషుల అవతారమనీ నా భర్త ద్వారానే గ్రహించాను,

లక్ష్మణు: మీ నాథు డెవరు?

సులో: రామచంద్రా. ఆర్తత్రాణుడవని పేరు కాని నేను భిక్షువేడను. ఒక్క న్యాయమైన కోరిక కోర్తాను అది ఒకటె చెల్లించండి.

రామ: అమ్మా నీవు ఇంద్రజిత్తు భార్యవా!

లక్ష్మ: ఆహా! విధివైపరీత్యము. ప్రళయాగ్ని భయంకరలోచనుడైన పురుషునికి సర్వలోకాతీత ప్రసన్నమయ లోచన, సౌభాగ్యవతీలలామ, భార్య! అమ్మా! నీవు రూపాన నా తల్లిలాగున్నావు మనస్సుకు కుమార్తె వనిపిస్తున్నావు నీ భర్తను చంపిన ఘోరానికి నేనే బాధ్యుడను.

సులో: తండ్రీ నువ్వు నిజంగా తండ్రివే ఆదిశేషుని అవతారమవు. కాకుంటే నా భర్త నీచేత నేల బడడు.

రామ: అమ్మా యీ ఏమి కోరుకుంటావో కోరుకో అమ్మా నీ భర్త ప్రాణాలనైనా నీ కిప్పిస్తాను.

అంగదుడు: రామచంద్రా జాగ్రత్త ఈమె స్త్రీ కాదు రాక్షసమాయ మాయాసీతను మరచిపోవద్దు.

సుషే: శ్రీ రామచంద్రా! విభీషణులు మిమ్మ మరీమరీ హెచ్చరించమన్నారు రావణాంతఃపురాంగన లెవరూ ఇటు రారని ఆయన చెప్పారు ఈమె ఇంద్రజిత్తు భార్య కాదు అసలు నిజంగా మాయ తప్ప దేహి కానే కాదు.

రామ: సుషేణా! మాయే అయితే ఇంత సైన్యాన్ని చీల్చుకొని చెక్కుచెదరకుండా వచ్చిన ఈమె ఇంద్రజిత్తు దేహం వద్దకు ఎందుకు వెళ్ల లేకపోయింది?

సుషే: అక్కడ హనుమ కాపలా ఉన్నాడు.

రామ: అయితే?

అంగ: రామచంద్రా. మీవంటి శరణాగతత్రాణులే కాదు ఎంతటి సామాన్యులూ కూడా ఆమె కంటిచూపున బడి, ఆమె మాట వింటే, ఆమెను నిరోధించగల త్రాణ లేకుండా నిర్వీర్యులై పోతున్నారు.

రామ: ఓహో, ఏమి మహిమాస్పద మూర్తి! మరి హనుమ నెందుకు జయించలేకపోయింది?

సుషే: హనుమ ఆమెను చూడకుండా దేహం వెంచేసి, కన్నులు చెవులు మూసేసుకొని రామనామస్మరణ చేసికొంటూ, ఆమె మాటను చూపునూ కూడా చెవికి కంటికి ఎక్కనీయలేదు. మాకు ఆ ఏకాగ్రత లేక జారిపోతూ వచ్చాము

రామ: అంగదా హనుమను ఇంద్రజిత్తు దేహాన్ని ఇక్కడికి తీసికొనిరమ్మని చెప్పు.

(అంగదుడు సుషేణుడు వెళ్తారు.)

సులో రామచంద్రా ధన్యోస్మి

సుషే (ప్రవేశించి) శ్రీరామచంద్రా విభీషణుడొక్కమాట చెప్ప మన్నారు శరణాగతరక్షకబిరుదంతో ఇంద్రజిత్తు ప్రాణాలను ఇప్పుడు ఈమెకు వరంగా ఇస్తే, మళీ వంద వానరులు కాదు, దేవతలైనా, ఇంద్రజిత్తును జయించలేరనీ, మనసేన సర్వనాశనం కాక తప్పదనీ, చెప్పమన్నారు

లక్ష్మ (చిరాకుతో) సుషేణ! శ్రీరాములను భయపెట్టడం, రావణుడికే చేతకాలేదు తెనవు కాతుందని విభీషణు లవకో నక్కరలేదని చెప్పు

సు. స్వామీ కోపించవద్దు పెద్దవారి సమస్యలు వేరు! బంటుతనపు వారి బాధలు వేరు

అంగదుడు శ్రీరామచంద్రా, హనుమకు నామాట వినపడటంలేదు

రామ (గట్టిగా) హనుమా!

హనుమ (నేపథ్యంలో) ఆ! స్వామీ! రామచంద్రా

రామ ఇంద్రజిత్తు నిటు తీసికొని రావన్నా

సుషే స్వామీ ఈమె ఇంద్రజిత్తు భార్య అని ఋజువేమిటి? ఈమె పతిప్రాణాలు భిక్షఅడిగితే?

సులో వానరవీరా నీకా భయంవద్దు నా పతిప్రాణాల భిక్షఅడిగి పౌలస్త్యవంశాని కగౌరవం కల్పించటానికి నేను రాలేదు.

అంగదుడు: (ప్రవేశించి) స్వామీ. హనుమ ఆ దేహాన్ని శిబిరద్వారంలో ఉంచాడు. అదుగో.

రామ: సుషేణా, అతనిలో ప్రాణం ఉందా. నీ వైద్యంతో బ్రతికించగలవా?

సుషే: స్వామీ నేను అల్పుడను. ఏమి చెప్పను.

సులో: శ్రీరామచంద్రా, ఆ వీరునికి ఇష్టంలేని పనిచెప్పి వారిని అవమానించకండి.

అంగదుడు: అసలీమె ఇంద్రజిత్తు భార్య అని ఋజువు ఏమిటి?

సులో: తండ్రీ లక్ష్మణదేవా! నీవు ఆ విషయం నమ్మగలవా?

లక్ష్మణ: ఔనమ్మా. నీవాక్కు అబద్ధం కాదు.

సులో: రామచంద్రా.

రామ: దీనికి ఋజువక్కరలేదమ్మా.

సులో: ఓహో స్వామీ! ఔనని చెప్పలేదు. ఔను! మీరు నమ్మినా లోకం నమ్మవద్దా! సుషేణా వీరిలో ప్రాణం లేదని కదా నీవనేది

సుషే వైద్యశాస్త్రం ప్రకారం అస్థిగతంగా కూడా ప్రాణం మిగలలేదు

సులో అస్థిలో ఇంద్రియ సంచలనం రాగల పరిస్థితి ఉండదుగదా

సుషే ఉండదు దీని

రామ అమ్మా నేను ఋజువు లడుగుట లేదు నీ పతి ప్రాణాలు నువ్వు కోరుకొన్నా ఇస్తాను చెప్పు

సులో కాదు తండ్రీ కోరను కాని వానరవీరులారా ఈ పడిపోయిన నా పతి దేహం నా పలుకుకోసం కణప్రాణం అట్టేపెట్టుకొని ఉంది ఇదిగో ఋజువు చూడండి (గట్టిగా) ప్రాణపతీ, ప్రాణపతీ, రావణేశ్వరకుమారా – నేను సులోచనను నా ప్రాణపతిని మాతో వచ్చేందుకు నాకు అనుజ్ఞ ఇయ్యండి ప్రభూ పలకవా?

దేహ (సన్నగా) ప్రియమైన సులోచనా! రా! నా వెంటరా

అంగ ఆ! ఆ! మోసం కళేబరం కన్నులు తెరచి చూసింది పెదవులు అల్లాడాయి స్వామీ రామచంద్రా! ఇది రాక్షసమాయ నమ్మకండి ఈ స్త్రీని వదల వద్దండి (గట్టిగా) హనుమా! రామలక్ష్మణులను భద్రం చెయ్యి! విభీషణా! నీలా జాంబవాన.

రాము అంగదా భయంలేదు

సులో నిజం స్వామీ భయం లేదు నా పతివల్ల మీ కెవరికీ భయం లేదు స్వామీ రామచంద్రా నా పతితో సహగమనానికి అనుమతియ్యి నన్ను దీవించు

రామ సౌభాగ్యవతీ భవ

వానరులు (హాహాకారంతో) ఆ ఆ ఇంద్రజిత్తు బ్రతుకుతాడు


సులో భయం లేదు ప్రాణపతీ, మేఘనాథా ఇదిగో నా కన్నులనుంచే యోగాగ్ని ప్రజ్వరిల్ల చేస్తున్నాను ఈ అగ్నిలో ఇద్దరం శివసాయుజ్య మందుతాము ఓం, ఓం, ఓం (అని జపిస్తూండగా యోగాగ్నిలో ఇద్దరి దేహాలు మునిగిపోతాయి)

వాన అన్నా ఏమి వింత! రామచంద్రా రక్షించు ఈ వెలుగు, వేడి, భరించలేము ఓహోహో

లక్ష్మ ఓహోహో! ఏమి సౌభాగ్యం తల్లీ నిజంగా నీవు సౌభాగ్యవతిని పతికి నీతో శివసాయుజ్యం కల్పించగల్గావు ఆహా జవితాగ్ని చల్లారిపోయింది వానరులారా! తేజం ఉపసంహరింపబడింది భయంలేదు కళ్లు తెరవండి అన్నా సంతాన మెరుగని నాకు ఈమె నిజంగా కుమార్తె అనిపించింది

రామ ధన్యజీవిని సులోచనా

శ్రీ ఎ. ఎ. ప్రసాదరావు.



పాక్ ప్రధాని లియాకత్ అలీఖాన్ 2వ తేదీన ఢిల్లీ వచ్చినప్పుడు భారతప్రసిడెంట్ రాజేంద్రప్రసాద్ ఆయన్ను ప్రభుత్వభవనంలో కలుసుకున్నారు.